# తెగుళ్లు

- అనిశెట్టి శ్రీధర్.



సీతారామయ్య నిద్ర లేచేసరికి తండ్రి ఇంట్లో లేడు.

'నాన ఏడే'

'చేనుకు పోయాడు. నువ్వు అబ్బాయిని సూట్టానికి గుంటూరు పోతాన్నావని లేపలేదు" (కొడుకు గుంటూరులో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు)

'చేనుకాడికి పోయి నానతో చెప్పి పోతా'

సీతారామయ్య తయారయ్యి బయల్దేరాడు.

ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు సాంబయ్య. రథం మీద వెడుతున్న రాజులా కనిపించాడు సీతారామయ్యకి. నీకెందుకు నానా ఈ పనులు అంటే సాంబయ్య ఒప్పుకోడు. కాయకష్టం చేసే తత్వం. అరవై ఏళ్లొచ్చినా మనిషి నిండుగా, దృఢంగా ఉంటాడు. పూర్వం సాంబయ్య సలహా, సహకారాలు తీసుకోనివాళ్లు అరుదు. తరువాతి కాలంలో పార్టీలు వచ్చి జనం గ్రూపులు కట్టారు. ఇప్పటికీ సాంబయ్యంటే గౌరవమే, కొందరికి హడలే.

'పిల్లాడ్ని చూశాక పత్తి యిత్తనాలు కొనక్కరా. ఎంకట్రావు కొట్టుకే పో. డబ్బులెత్తక పోతన్నావా'

సీతారామయ్య తలూపాడు.

**గే(జా)మ్**

రాజకీయమనేది నిజంగా
టెరిఫిక్ గేమ్!
రోడ్లమీద దాన్ని ప్రదర్శిస్తే
ట్రాఫిక్ జామ్!!

*- వారణాసి రామకృష్ణ*

డబ్బాశ ఎక్కువవడంతో మోసాలు ఎక్కువయ్యాయి. జిన్నింగ్ చేసిన విత్తనాలే అందంగా ప్యాక్ చేసి హైబ్రీడు విత్తనాల్లా చలామణి చేస్తున్నారు. వ్యాపారస్తులు తెలివిమీరి మంచి విత్తనాలు, నకిలీ విత్తనాలు మిక్సింగ్ చేసి అమ్ముతారు. దిగుబడి తక్కువగా ఉంటుంది. రైతు నా ఖర్మ అని సరిపెట్టుకుంటాడు. పురుగు మందులూ అదే దారి. నకిలీలు రాజ్యమేలుతుంటాయి. దాడిచేసి పట్టుకోవలసిన అధికారులకు నెలవారీ ముడుపులు అందుతాయి.

సాంబయ్య భోజనానికి బయలుదేరాడు.

వీరాస్వామి చిన్నకొడుకు మిర్చి హైబ్రీడు విత్తనాలు నారు పోస్తున్నాడు. పంచాయితీ ఎన్నికలప్పుడు సీతారామయ్యా, చిన్నబ్బాయీ గొడవపడి వలుకోక్వడం లేదు. అయినా సాంబయ్య మనసు నిలవలేదు.

'చిన్నబ్బాయ్‌! విత్తనాలు నాటబోకు. నారుకుళ్లు తెగులు సోకుద్ది' హెచ్చరించాడు సాంబయ్య.

'సరే బాబాయ్' అన్నాడు చిన్నబ్బాయి.

- - - - -

ప్రత్తి చెట్లు అంతెత్తున పెరిగాయి. కాయ కూడా బాగానే ఉంది. పురుగు మందులు కొడుతున్నారు. పచ్చపురుగు ఎక్కువగా ఉంది. తెల్లదోమ లేకపోవడం అదృష్టం అనుకున్నారు.

తిరుపతయ్య పొలంలో ఎవరో కొత్త కంపెనీవాడు పురుగుమందు చల్లి చూపిస్తున్నాడు. కొట్లకు కూడా అదే శాతం వున్న మందును సరఫరా చేస్తారో లేదో అనుమానమే. ఊళ్లోవాడు కనుక మందులకొట్టు వెంకటరెడ్డి తెలిసినంత వరకు జాగ్రత్తలు చెబుతాడు.

మోసం జరిగేది ఎక్కువగా కంపెనీల్లో, టోకు వ్యాపారుల దగ్గరా. గుంటూరు పోతే ఎవడు అప్పు పెడితే వాడిచ్చిన బలం మందులూ, పురుగు మందులూ తెచ్చుకోవాలి. డబ్బు పెడితే నాణ్యమయిన మందులు కొట్లవాళ్లకి ఎక్కువగా అప్పు పుట్టేది నాణ్యత తక్కువ కంపెనీల నుండి. మార్జిన్ ఎక్కువ. అప్పు ఇచ్చేటప్పుడు ఆ మందులే అంటుగడతారు. రైతులు కూడా ప్రక్క రైతు కొంటున్నాడనో, ధర తక్కువనో ఏదో ఒకటి కొంటుంటారు. దౌర్భాగ్యం ఏమిటంటే రైతులకు సలహాలిచ్చేది వ్యవసాయ శాఖ అధికారులు కారు, మందుల కొట్లవాళ్లు.

దీపావళి రోజులు. మిరప తోటలకి నీళ్లు పెట్టడానికి ట్యూబులు అద్దెకు తెచ్చుకోవడానికి నత్తెనపల్లి పోయి మాట్లాడి వచ్చాడు సీతారామయ్య.

వర్షం మొదలయింది చిన్నగా. 'ఇప్పుడు వర్షం ఏందబ్బా' అనుకున్నారు రైతులు.

ఒకటి, రెండు రోజులు వర్షం ఒక మాదిరిగా కురిస్తే నష్టం ఉండదు. మైలపత్తి ఎటూ నాణ్యత తక్కువే. రెండు రోజులు గట్టిగా ఎండకాస్తే తేమ ఆరిపోతుందనుకున్నారు. కానీ వర్షం పెద్దదైంది.

వాన రాకడ, ప్రాణం పోకడ తెలీదంటారు. నవంబర్ నెలలో వర్షాలంటే రైతుల ప్రాణాలు పోయినట్టే. దీపావళి నాటికి దీపాంతరం అయిపోవాలి. వర్షాలు పడకూడదు.

వర్షం ఆగేలా లేదు. అంతకంతకూ పెద్దదవుతోంది. ఈడ్చి కొడుతున్నట్టుంది.

పైర్లు విల్లవిల్లాడాయి. రైతులు గగ్గోలు పెట్టారు. ఒకటి కాదు, రెండు కాదు, పది రోజులు ప్రకృతి పగబట్టినట్టు భోరున వర్షం.

భోరున వర్షం
తీరని శోకంలా
రావణ కాష్టంలా
వాగులు వంకలు
పొంగి పొర్లీ
అరె ఇంతటి కక్ష
రైతుకు ఎంతటి శిక్ష

చేలన్నీ నీట మునిగాయి. చెట్టూ చేమా నేలకొరిగాయి. రైతుల గుండెల్లోంచి వేదన

పొంగిపొర్లింది.

పైర్లు పీకి కొత్త పైరు వేసుకునే స్తోమత ఎవరికీ లేదు. పండినంత పండుతుందని నిర్వేదంగా సేద్యం కొనసాగించారు.

ట్రాక్టర్ బాడుగకు తోలిన సీతారామయ్యకు ఆయిల్ డబ్బులు కూడా మిగల్లేదు. రైతుగా పరిస్థితి తెలిసిన వాడవడంతో ఎవరినీ గట్టిగా అడగలేకపోయాడు. మళ్లీ ఏడు పంటలు బాగుంటే ఇచ్చినంత పుచ్చుకోవడమే. పెద వెంకటేశ్వర్లు కొడుకు నర్సింహులు పొలం దున్నే పనికి పోనని తండ్రితో దెబ్బలాడి క్వారీకి రాళ్లు తోలడానికి ట్రాక్టర్ పట్టుకుపోయాడు.

ఎకరాకు ఎనిమిది నుండి పది క్వింటాళ్లు పండే ప్రత్తి యాభై కిలోలు దక్కింది. తీయించడానికి కూలి డబ్బులు దండగయ్యాయి.

రాజకీయ నాయకుల దగ్గరకు, ప్రభుత్వాధికారుల దగ్గరకు పోయి రైతులు మొరపెట్టుకున్నారు. వ్యవసాయశాఖ నుండి ఒకరు వచ్చి తెలిసిన రైతు ఇంట కూర్చుని నాలుగు పేర్లు రాసుకుని పోయాడు. ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆ నలుగురే ఆ గ్రామంలో నష్టపోయిన రైతులు. వాళ్లలో ఇద్దరికి ఎకరాకు ఐదు వందల చొప్పున నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంది ప్రభుత్వం. అసలు నష్టం ఎకరాకు పదివేలు.

\- - - - -

మర్రిచెట్టు కింద రచ్చబండ మీద తీరికగా కూర్చున్నారు రైతులు. వర్షాలు సరిగా పడక పనులు ముందుకు సాగడం లేదు.

'కరణం(వి.ఎ.ఓ.) కాడికి పోయొచ్చా'

'ఏమన్నాడు'

'ఇంటికి పోతే కాయితాలు ఆఫీసులో ఉన్నాయంటాడు. ఆఫీసుకి పోతే కాయితాలు నిన్న సాయంత్రం ఇంటికట్టుకు పోయానంటాడు. కాయితం ఉంటేనే బేంకివోళ్లు లోను పెంచుతామంటున్నారు.'

'గవర్నమెంటుతో పని కావాలంటే కర్రెట్టుకొట్టాలి లేదా పచ్చ కాయితమెట్టి కొట్టాలి' చతురాడాడు ఒక రైతు.

'కర్రుచ్చుకుంటే నక్సలైటని బొక్కలో తోస్తారు. డబ్బులు పారనూకు. కాయితం ఉరుక్కుంట వస్తది'

'డబ్బులీకుండనే. మొన్నే పారేశా. పదిమార్లు తిరిగితేనే ఆయనకు తృప్తి'

'మేనేజరు మాక్కూడా లోను పెంచుతున్నాడు మావా! ఆ తిరుగుడు పడలేకనో ఈ యేటికి ఇట్టనే కానీండని ఊరుకున్నా'

'యమ్మార్వో, యమ్డీవో ఆఫీసు యాడైన అంతేలే. ఆళ్ల కోసం మనం కానీ, మన కోసం ఆళ్లు కాదు'

'ఏహె. ఇదెప్పుడూ ఉండే గొడవేలే. పదేను రోజులయ్యి సుక్క వర్షం లేదు. పరిస్థితి ఏందో అర్థం గాకుండా ఉంది' అని వాపోయాడు ఒక రైతు.

వసారాలో వాలుకుర్చీలో పడుకున్నాడు సాంబయ్య.

'నీళ్ల కోసం మనిషి ఎంత తపన పడుతున్నాడో. నీళ్ల కోసం యుద్ధాలు కూడా జరుగుతాయంట. వర్షం అంటే పట్నపోళ్లకి చిరాకు. ఇస్కూలుకి పోడానికి, ఆఫీసులకి పోడానికి రోడ్లన్నీ బురదగుండి చాన ఇబ్బందనుకుంటారు. పల్లెల్లో బురదలో దిగి మట్టి పిసికితేనే జీవనం'

పక్క ఇంటిలో కుర్రాడు గట్టిగా పాఠం చదువుతుండడంతో సాంబయ్య ఆలోచనలు ఆగాయి. నాగేశ్వరరావు మనవడు కాన్వెంట్‌లో మూడవ తరగతి చదువుతున్నాడు.

'దేర్ ఈజ్ త్రీ సీజన్స్ ఇన్ ఇండియా. దే ఆర్ సమ్మర్, రైనీ అండ్ వింటర్ సీజన్స్'. కానీ ఆ సంవత్సరం రాష్ట్రంలో వర్షాకాలం అనేదే లేదు. జూన్ నెలలో పడిన చెదురుమదురు వర్షాలకి రైతులు నాట్లు మొదలుపెట్టారు. తర్వాత చుక్క వర్షం లేదు. మొక్కలు మొలవక వేసిన విత్తనాలు దండగయ్యాయి. లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఏర్పడింది. ఏ ప్రాజెక్టులు కిందా నీటిచుక్క లేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా నీటిమట్టాలు పడిపోయాయి.

ఎటు చూసినా కరువే. బీటలు వారిన భూములు, ఎండిపోయిన పైర్లు, ఇంకిపోయిన బోర్లు. ఏదీ వర్షం.

ఏదీ వర్షం
ఎండిన గొంతుల
వాడిన పైరుల
కేదీ హర్షం
ఎంతటి నష్టం
కూలీ నాలీ
రైతు వారీ
ఎంతటి నష్టం

వ్యవసాయ కూలీలకు పనుల్లేవు. పశువులకు మేత లేదు. పస్తుండలేక పనుల కోసం కూలీలు, సన్నకారు రైతులు పొట్ట చేతపట్టుకుని పట్నాలకు వలస పోయారు.

'పోయినేడు వద్దన్నా వర్షమే. ఈ పాలి కురవాల్సిన వర్షం పోయినేడే కురిసినట్టుంది. మరి రైతుల పరిస్థితేంది' ఏ రైతును కదిపినా ఇదే మాట.

యాభై శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా అని ప్రకటించింది ప్రభుత్వం. విత్తనాలు నాసిరకం అని కొన్నిచోట్ల రైతులు గొడవ చేశారు.

మార్కెట్‌ను కనిపెట్టుకునుండే సుబ్బారావు చెప్పాడు– 'అంతా మాయరా. మిర్చి విత్తనాలు మనం నేరుగా కొంటే పది గ్రాములు రెండొందలా. కంపెనీలు సీడు కార్పొరేషనుకి మూడొందల యాభై అని ప్యాకెట్టు మీన ముద్దరేసి ఇస్తాయి. సీడు కార్పొరేషను అల్ల కమీషను కలిపి నూట ఎనభై ఐదు రూపాయలకి మనకి అమ్ముతుంది. ఇదీ సబ్సిడీ కత'.

మళ్లీ వర్షాలు కురిస్తే ఏ పంటలు వెయ్యాలి, సేద్యం ఎలా చెయ్యాలి అంటూ ప్రభుత్వాధికారులు బస్తీల్లో సమావేశాలు జరిపారు. పల్లెలకు వెళ్లిన దాఖలాలు లేవు.

ఆలస్యంగా కురిసిన వర్షాలతో రైతాంగం కొంత తేరుకుని పనులు మొదలుపెట్టారు. వర్షాలు దోబూచులాడుతూనే ఉన్నాయి.

ప్రత్త పంటకు తెల్లదోమ తాకిడి ఎక్కువై కాయలోని రసాన్ని అంతా పీల్చి పిప్పి మిగిల్చింది.

కొన్ని రకాల 'తెగుళ్ల'కి ఇంకా మందు కనిపెట్టాలి.

అతివృష్టి, అనావృష్టితో వరుసగా రెండేళ్లు నష్టపోయిన రైతాంగం మరు సంవత్సరం వాతావరణం అనుకూలించి పంటలు బాగానే ఉండడంతో ఊపిరి పీల్చారు. ముందు సంవత్సరం కరవు గురించి అందరూ మరచిపోయారు. చావు తర్వాత ఇంట్లో శుభకార్యంలా.

ప్రత్తి దిగుబడి ఫరవాలేదనిపించింది. పురుగు ఎక్కువ లేకపోతే ఇంకా బాగుండేది. కంపెనీల వాళ్లు శాస్త్రజ్ఞులకిచ్చే మందుల్లో పర్సంటేజీ సరైనది ఉంటుంది. వాళ్లు ప్రయోగాలు చేసి ఎంత మందు ఎన్ని నీళ్లల్లో కలిపి పిచికారీ చెయ్యాలో చెబుతారు. రైతు కొన్ని మందులు ఆ మోతాదులో పనిచెయ్యవు. పురుగు చావదు. మళ్లీ కథ మామూలే. ఈసారి కలుపు ఎక్కువై తియ్యటానికి కూలీ ఖర్చులు ఎక్కువయ్యాయి. ప్రత్తి అమ్ముకోగా, పెట్టిన ఖర్చులు తిరిగొచ్చి మిరప తోటలకి నీళ్లు పెట్టడానికి. కోతలకి కూలీ డబ్బులు వెతుక్కోనవసరం లేదనిపించింది. మిర్చి పరిస్థితి బాగానే ఉంది. ఎకరాకు ఇరవై క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ మధ్య కాలంలో పదిహేను క్వింటాళ్లయితే చాలనుకునే పరిస్థితి వచ్చింది.

మిర్చి రెండో కోతలో పది క్వింటాళ్ల వరకు తెగింది. మిర్చి కళ్లాల్లో ఆరబోసి వారం అవుతోంది. సూర్య కిరణాలు తాకి ఎటుచూసినా ఎరుపు రంగుతో కళ్లాలన్నీ మెరిసిపోతున్నాయి. తాలుకాయ కూడా తక్కువగానే ఉంది. రైతాంగం హుషారుగా ఉంది. మరో పది రోజులు ఆగితే చాలు. రేటు కూడా బాగానే పలుకుతుంది. సరాసరి యార్డుకి తోలచ్చు. లేకపోతే ఎ.సి.(కోల్డ్ స్టోరేజ్)కి.

నాలుగేళ్లనాడు క్వింటాలు నాలుగు వేలున్నా బంగ్లాదేశం ఆర్డరు వస్తుందని, ఆరువేలవుతుందని అమ్మక అందరూ ఎ.సి.ల్లో పెట్టి చివరకు మూడు వేలకు అమ్ముకోవలసి వచ్చింది. ఎ.సి. ఖర్చులు, వడ్డీలు, తడిసి మోపెడయ్యి కొంచెం లాభంతో బయటపడ్డారు. ఈసారి అత్యాశకు పోకూడదనుకున్నారు.

'ఆ ఈది సివర్న ఎవుర్రా మోటారు సైకిలు మీన, ఫీల్డాఫీసరేనా'

'అవును మావా'

'ఇంతెండలో పడి తిరుగుతున్నాడేంది'

'నారాయణ కొడుకు రాంబాబు లేదూ... పొలం లోను చెల్లెయ్యలేదంటూ కోర్టుకేసే టయమయిందని సెప్పడానికొచ్చాడు'

'ఆడికేం మాయరోగం. కట్టిన రెండోనాటికే లోను తిరగరాస్తా ఉన్నారంటనే బేంకివోళ్లు'

'ఫీల్డాఫీసరు పాపం అదే నెత్తీనోరూ కొట్టుకుని సెబుతున్నాడు మనోల్లందరరికీ'

అంతకు ముందున్న మేనేజరు మాత్రం రైతుల్ని పీడించుకు తిన్నాడు. లోను ఇవ్వడానికి పదిసార్లు తిప్పించుకునేవాడు. ఎకరాకు ఇంతకు మించి ఇచ్చేది లేదు పొమ్మనేవాడు. బ్రోకర్లను పెట్టుకుని డబ్బా గడించాడు.

కొడుకు పేరున పాస్ పుస్తకం రాయించాక సాంబయ్య బ్యాంకుకి వెళ్లడం లేదు.

ఫీల్డాఫీసరు ఊళ్లోకి వచ్చినపుడల్లా సాంబయ్య ఎదురుపడితే పలకరించకుండా ఉండడు.

'నువ్వు రైతులకి బాగా సహాయం చేస్తున్నావని విన్నాన్లే' ఒకసారి అతనితో అన్నాడు సాంబయ్య.

'ఇల్లు కట్టినా, పిల్ల పెళ్లి చేసినా, ఇంట్లో ఎవరైనా చనిపోయినా బ్యాంకు బాకీ కట్టకుండా ఆపేస్తారు రూపాయి వడ్డీయే కదా తర్వాత చూసుకుందామని. బ్యాంకుని ఉపయోగించుకోమని చెప్పండి' అనేవాడు సాంబయ్యతో.

ఉదయం నుండీ ఫెళ్లున కాసిన ఎండ సాయంకాలం అయ్యేసరికి మాయమయి మబ్బు పట్టింది.

'రేయ్ సీతారాముడూ! పట్టాలట్టుకెళ్లి కళ్లంకాడ పడెయ్' పురమాయించాడు సాంబయ్య.

'శివరాత్రి రోజులు కద నానా. కాస్తంత మబ్బు పట్టిందంతే' అన్నాడు కొడుకు. ఇంతలో చినుకులు మొదలయ్యాయి.

సీతారామయ్య, అతని భార్యా పట్టాలు ట్రాక్టర్‌లో వేసుకుని కళ్లం వైపు ఉరుకులెత్తారు. మిర్చి మీద పట్టాలు కప్పుతున్నారు రైతులు. సన్నటి చినుకులతో రాత్రి గడిచింది.

ఉదయం వర్షం పెద్దదైంది. ప్లాస్టిక్ సంచులు-ఎరువుల సంచులు కొన్నే వున్నాయి.

'ఈ పట్టాలు ఆగవు. వర్షం పెద్దదయేలా ఉంది. గుంటూరు పోయొచ్చేదా నానా'

గుంటూరు బజారునిండా రైతులే. వ్యాపారస్తులకి పండగ. ఒక్క గంటలో ప్లాస్టిక్ పట్టాల ధర మూడు రెట్లయ్యింది.

పట్టాలు కొనుక్కుని బస్సులో కూర్చున్న సీతారామయ్య 'ఛ యెదవ బతుకు. పట్టాలు అమ్ముకున్నా గడిచిపోదా' అనుకున్నాడు.

వర్షం అంతకంతకూ పెరిగిపోతూ రైతుల గుండెలు జారిపోయాయి. ఏం వర్షం. ఎంతటి వర్షం. ఆ రోజు కురిసిన వర్షానికి ఊరే మునిగిపోతుందనిపించింది. మిర్చిపై కట్టిన పట్టాలు దేవతా వస్త్రాల మాదిరి అయ్యాయి. కళ్లాల దగ్గరకెళ్లి ఏం జరుగుతుందో చూసే ధైర్యం లేకపోయింది. వెళ్లిన వాళ్లకు ఏం చెయ్యాలో, పంటను ఎలా కాపాడుకోవాలో తెలీక దిక్కుతోచలేదు. ఏం వర్షం...

అరె ఇదేమి వర్షంరా
అకాల మృత్యువులా
పంటతల్లి గుండెలపై బాకులు విసిరీ
వెన్నెముక రైతన్నల నడుములు విరిచీ

మిర్చి కళ్లాల్లో నీళ్లు. రైతు కళ్లల్లో నీళ్లు. కళ్లల్లో తేలుతున్న మిర్చిని చూసి రైతులు గుండెలు బాదుకున్నారు. పడిన శ్రమ, అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులు, కట్టవలసిన కౌలు బాకీ, కుటుంబ ఖర్చులు కళ్లముందు కదలాడాయి.

ప్రతి సంవత్సరం మంచి కాయల నుండి తాలుకాయ ఏరేసేవాళ్లు. ఈసారి తాలుకాయల్లో మంచివి ఎక్కడో వెతుక్కోవలసి వచ్చింది. మొత్తం తాలుకాయలయి క్వింటాలు ఎనిమిది వందల చొప్పున మందుల కొట్లవాళ్లు, అప్పులిచ్చినవాళ్లు తొక్కుకున్నారు. పెట్టుబడిలో సగం కూడా వెనక్కు రాలేదు.

## ఫ్యాన్స్

అభిమానమొస్తే
పూలు - చప్పట్లు
ఆగ్రహమొస్తే
రాళ్లు - చెప్పులు

*- అయినంపూడి శ్రీలక్ష్మి*

'అబ్బాయ్... అంతా అయిపోయింది' శవ దహనం చేసి వచ్చిన వాడిలా అన్నాడు సాంబయ్య.

- - - - -

ప్రత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్టు తెలంగాణా జిల్లాల నుండి వస్తున్న వార్తలు విని సాంబయ్య కుమిలిపోయాడు.

నాలుగు దశాబ్దాలకు పైగా వ్యవసాయం చేస్తున్నాడు సాంబయ్య. రైతు పరిస్థితి ఎలా వుంది అని ఆలోచనలో పడ్డాడు ఈనాడు.

సామాన్య రైతు కూడబెట్టిందేమీ లేదు. రైతుకు ఎవరూ ఒరగబెట్టిందీ లేదు.

విత్తనాలు, పురుగుమందులు అన్నిటా నకిలీవే. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం మిగిలిన ప్రపంచం కంటే ఎందుకు భిన్నంగా ఉంటారు. అవినీతి, అలసత్వంలో కూరుకుపోయి ఉన్నారు. ప్రభుత్వ కార్పోరేషన్లు ఎప్పుడూ వ్యాపారస్తులకే తోడూ నీడగా ఉంటాయి.

పండించినవి మార్కెట్ చెయ్యడానికీ, గిట్టుబాటు ధర కల్పించడంలోనూ ప్రభుత్వాలు చేతకానితనం ప్రదర్శిస్తున్నాయి.

ప్రకృతీ కరుణించదు. ఒక సంవత్సరం అతివృష్టి, మరో సంవత్సరం అనావృష్టీ, అత్యాశా, అజ్ఞానం రైతును మరీ కుంగదీస్తున్నాయి.

సాంబయ్య డీలా పడిపోయాడు. ముసలితనం అమాంతం మీద పడినట్టనిపించింది.

'అబ్బాయ్! నేనిక పొలంకాడికి రానురా' నేనిక ఊపిరి పీల్చనురా అన్నట్టు చెప్పాడు సాంబయ్య. సీతారామయ్య నిర్ఘాంతపోయాడు. ఈ మాట తను ఎన్నోసార్లు అంటే తండ్రి మందలించేవాడు. తల్లి మీద, తినే అన్నం మీద ఎవరేనా అలుగుతార్రా అనేవాడు.

సాంబయ్య నిర్ణయం ఊరంతా ఒక వార్త అయ్యింది.

'ముసలోడైపోలే' అన్నారు కొందరు.

'లేదురేయ్. సాంబయ్య తాత యవసాయం సేసినట్టు ఈ మండలంలోనే ఎవరూ సెయ్యరు. ఈమద్దిన ఏందో దిగాలుగా ఉంటున్నాడు' అన్నాడు పోలిరాజు. తండ్రి లేని వాడికి అరక తోలడం నేర్పింది సాంబయ్యే.

ప్రతి కట్టెలు పీకెయ్యడం, పిచ్చి చెట్లు నరికి భూమి చదును చెయ్యడంతో పనులు మొదలయ్యాయి.

రోజులు గడుస్తున్నా సాంబయ్య ఇంటిపట్టునే ఉంటున్నాడు. నలుగురైదుగురు కదిలించి చూశారు. పెదవి విప్పలేదు.

'మూడేళ్ల నుండీ దరిద్రం పట్టుకున్నట్టు పంటలు దెబ్బతింటుంటే ఎవరికైనా మనసు యిరిగిపోదూ' అన్నారొకరు.

తండ్రి వైఖరి చూసి సీతారామయ్య మనసును దిగులు ఆవరించింది.

- - - - -

మృగశిర కార్తె.

రాత్రి కురిసిన వర్షానికి ఆరుబయట పడుకున్న వాళ్లంతా మంచాలు ఇళ్లల్లో వేసుకున్నారు. తెల్లవారుఝామున సీతారామయ్యకి మెలకువ వచ్చింది. ప్రక్క మంచం మీద తండ్రి లేదు. ఒకటికేమన్నా వెళ్లాడేమో అనుకున్నాడు. పది నిముషాలయినా రాలేదు. భార్యను నిద్రలేపాడు. నేను చూడలేదందామె.

సీతారామయ్యకు ఒక అనుమానం వచ్చి గుండె గుభేలుమంది.

ఛఛ... తండ్రి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. మూడేళ్ల నుండీ పడుతున్న శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరై నష్టాలపాలైన మాట నిజమే కానీ అప్పులపాలవ్వలేదు.

ఎందుకయినా మంచిదని లేచి గబగబా బయటకు నడిచాడు.

మర్రిచెట్టు కింద చప్టా మీద, రాములవారి గుడి మెట్లమీద- దార్లో ఎక్కడా సాంబయ్య జాడ లేదు. ఒకరిద్దరిని మా నాన్న కనిపించాడా అనడిగాడు. అనుమానం ఎక్కువై పడుతూ లేస్తూ పొలం వైపు పరుగెత్తాడు. పొలానికి అల్లంత దూరాన ఆగిన సీతారామయ్య నోరు తెరుచుకుని చూస్తుండిపోయాడు. కంగారులో ఇంటి పెరటి వైపు ట్రాక్టర్ ఉన్నదీ, లేనిదీ చూసుకోలేదు.

పొలంలో సాంబయ్య దుక్కి దున్నుతున్న దృశ్యం మనోహరంగా కనిపించింది.

❑